# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**10 నవంబర్, 2018**

## సీ.పీ.ఐ. (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి తన బాధ్యతల నుండి స్వచ్ఛందంగా విరమించుకోవడంతో, కామ్రేడ్ బసవరాజును నూతన ప్రధాన కార్యదర్శిగా కేంద్రకమిటీ ఎన్నుకొన్నది

కామ్రేడ్ గణపతి గత కొద్ది సంవత్సరాలుగా పెరుగుతున్న తన అనారోగ్య పరిస్థితినీ, పెరిగిన వయసును దృష్టిలో ఉంచుకోవడంతో పాటు, కేంద్రకమిటీని మరింత పటిష్టం చేసే లక్ష్యాన్ని కలిగి ఉంటూ ముందుచూపుతో తాను ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి స్వచ్ఛందంగా విరమించుకొని తన స్థానంలో మరొక కామ్రేడ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవాలని చేసిన ప్రతిపాదనపై కేంద్రకమిటీ 5వ సమావేశం క్షుణ్ణంగా చర్చించింది. ఆయన స్థానంలో కామ్రేడ్ బసవరాజు (నంబాళ్ల కేశవరావు)ను నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది.

1992 జూన్‌లో కామ్రేడ్ గణపతి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) పార్టీ జనరల్ సెక్రటరీ అయ్యాడు. అప్పుడు పార్టీకి అది చాలా కష్టకాలమనే చెప్పుకోవాలి. 1991 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పార్టీ పైన రెండవ వరుస దమనకాండను ప్రారంభించింది. ఆ సమయంలో సాయుధ పోరాటాన్ని పురోగమింపజేయడానికి చేపట్టాల్సిన ఎత్తుగడలకు సంబంధించిన పలు సవాళ్లను పార్టీ ఎదుర్కొంటున్నది. పార్టీ ఎదుర్కొంటున్న ఆ సవాళ్లను, అప్పటి కేంద్రకమిటీకి కార్యదర్శిగా ఉన్న కొండపల్లి సీతారామయ్య తన కమిటీకి నాయకత్వం వహిస్తూ పరిష్కరించగలిగే పరిస్థితిలో లేడు. అటువంటి పరిస్థితుల్లో, పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లను మొత్తం పార్టీ కేడర్ల పైనా, ప్రజల పైనా ఆధారపడి పరిష్కరించడానికి బదులు, కొండపల్లి సీతారామయ్యతో పాటు మరొక కేంద్రకమిటీ సభ్యుడు కుట్ర పద్ధతులు అనుసరించి పార్టీలో అంతర్గత సంక్షోభానికి కారణమైనారు. ఆ అవకాశవాద ముఠా పార్టీని చీల్చడానికి చేసిన ప్రయత్నాలను ఓడించేందుకు చేసిన సూత్రబద్ధ పోరాటంలో కొద్ది మంది అవకాశవాదులు మినహా మొత్తం పార్టీ సమైక్యంగా నిలబడింది. ఆ సందర్భంగా కేంద్రకమిటీలోని యువ నాయకత్వం అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టిన పద్ధతులు, మొత్తం పార్టీకి మంచి ఎడ్యుకేషన్ కేంపెయిన్‌లా ఉపకరించాయి. పార్టీ పని శైలిని సరిదిద్దాయి. మొత్తం పార్టీ సిద్ధాంత, రాజకీయ స్థాయినీ పెంపొందించాయి. ముఖ్యంగా కేంద్రకమిటీలో సమష్టి నాయకత్వాన్ని, టీం ఫంక్షనింగ్‌ని అభివృద్ధి చేసాయి. కేంద్రకమిటీలోని విప్లవ నాయకత్వం చేపట్టిన ఆ మొత్తం కృషిలో కామ్రేడ్ గణపతి ముందుపీఠిన నిలిచి కీలకమైన పాత్ర పోషించాడు. ఆ క్రమంలోనే, పార్టీ మొత్తం ఒక తాటిపై నిలబడి, కుట్రదారులను ఓడించి, తాను ఎదుర్కొంటున్న సవాళ్లను కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి లోబడి ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఈ పరిస్థితులలోనే సమిష్టి నాయకత్వంగా ఎదిగిన కేంద్రకమిటీకి, కామ్రేడ్ గణపతి, నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనాడు.

1995లో అఖిల భారత ప్రత్యేక మహాసభ జరిపి పార్టీ పంథాను సంపద్వంతం చేసుకున్నాము. ఆ మహాసభ నూతన కేంద్రకమిటీని ఎన్నుకొన్నది. నూతనంగా ఎన్నికైన కేంద్రకమిటీ కామ్రేడ్ గణపతిని తిరిగి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది. 1998 ఆగస్టులో సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), సీపీఐ (ఎంఎల్) (పార్టీ యూనిటీ)లు విలీనమై నూతనంగా సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)గా ఆవిర్భవించింది. ఈ పరిణామంతో పార్టీ అనేక రాష్ట్రాలకు విస్తరించి అఖిల భారత స్వభావాన్ని మరింత సంతరించుకొంది. ఆ సందర్భంగా ఏర్పడిన నూతన కేంద్రకమిటీకి కూడా కామ్రేడ్ గణపతిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది. 2000 డిసెంబర్ 2 నాటికి మిలటరీ పంథాను అభివృద్ధి చేసుకొని ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని నిర్మించుకొన్నాము. 2001లో జరిగిన మునుపటి సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్ పార్టీ, రాజకీయ, సైనిక, నిర్మాణ పంథాను మరింత సంపద్వంతం చేసింది. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని అన్వయించడంలో భాగంగా ఆ మహాసభ గెరిల్లాబేస్‌ల నిర్మాణం వంటి నూతన ఆవిష్కరణలు చేసింది. సీఎంసీ నాయకత్వం కింద ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని నిర్మించడంతో పాటు, ప్రజాయుద్ధానికి, రాజ్యాధికారానికి మధ్య గల సంబంధాన్ని పార్టీ నొక్కి చెప్పింది. ఆ సందర్భంగా ఏర్పడిన నూతన కేంద్రకమిటీ కూడా కామ్రేడ్ గణపతినే మరోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది.

2004 సెప్టెంబర్ 21న సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్), మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ)లు విలీనమై సీపీఐ (మావోయిస్టు) ఏర్పడింది. సంపద్వంతమైన సైద్ధాంతిక, రాజకీయ పంథాపై ఆధారపడి జరిగిన ఈ విలీనంతో భారత విప్లవోద్యమం ఒక గొప్ప గెంతు సాధించింది. ఈ పరిణామం భారత విప్లవోద్యమ చరిత్రలోనే ఒక మైలురాయి వంటిది. ఈ పరిణామం పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు విస్తరింపజేసింది. రెండు పార్టీలకు చెందిన గెరిల్లా సైన్యాలు విలీనమై బలమైన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంగా ఏర్పడింది. 2004 నాటికే దేశంలో చిన్న చిన్న పాయలుగా ఉన్న అనేక గ్రూపులు, వ్యక్తులు రెండు ప్రధాన విప్లవ స్రవంతులుగా ఉ

న్న ఎంసీసీఐ, సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్)లో విలీనమైనాయి. ఈ రెండు ప్రధాన ప్రవాహాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)పార్టీగా – ఒక గొప్ప మహా ప్రవంతిగా మారింది. అలా ఏర్పడిన సీపీఐ (మావోయిస్టు) పార్టీలో ఎంతో అనుభవం కలిగిన, అనేక కీలకమైన బాధ్యతలు చేపట్టిన, నక్సల్బరీ తరం నాయకులు కూడా ఉన్నారు. అటువంటి నాయకులు, శ్రేణులు కలిగిన పార్టీ కేంద్రకమిటీ, కామ్రేడ్ గణపతిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొన్నది. 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ సందర్భంగా కూడా కేంద్రకమిటీ ఆయననే ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నది. ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ అనంతరం, కేంద్రకమిటీ నాయకత్వంలో ఉద్యమం మరింత నూతన ఎత్తులకు ఎదిగింది. ఈ అభివృద్ధి క్రమంలోనే, 2013 చివరికి, సీపీఐ (ఎంఎల్) (నక్సల్బరీ), సీపీఐ (మావోయిస్టు) విలీనం కావడంతో భారతదేశ విప్లవ పార్టీల ఏకీకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తి అయిందని చెప్పవచ్చు.

1992 నుండి 2017 వరకు 25 సంవత్సరాల పాటు కామ్రేడ్ గణపతి కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన కాలమంతా ఉద్యమం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ కేంద్ర నాయకత్వంలో పురోగమించింది. ఉధృతమైన వర్గ పోరాటంలో పార్టీ రాటుదేలింది. శత్రువు చేపట్టిన ప్రతీఘాతుక విప్లవ దాడిని ఓడించేందుకు విప్లవ శ్రేణులకూ, విప్లవ ప్రజానీకానికి దృఢమైన కార్మికవర్గ నాయకత్వాన్ని అందించింది. కామ్రేడ్ గణపతి ఈ క్రమంలో పెరుగుతున్న తన అనారోగ్య సమస్యలను గుర్తించి, తద్వారా, పెరుగుతున్న వయసు రీత్యా ఏర్పడుతున్న పరిమితులను దృష్టిలో ఉంచుకొని, ప్రధాన కార్యదర్శి పదవి నుండి వైదొలిగి, కేంద్రకమిటీని మరింతగా పటిష్టం చేసే లక్ష్యంతో ఎప్పటిలాగే తన పూర్తి శక్తి సమర్థతలను కేంద్రకమిటీతో పాటు మొత్తం పార్టీ అభివృద్ధి కోసం వెచ్చించేందుకు సిద్ధపడినాడు. దీంతో ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ బసవరాజు (నంబాళ్ల కేశవరావు)ను కేంద్రకమిటీ ఎన్నుకొంది. కామ్రేడ్ బసవరాజు మూడున్నర దశాబ్దాలకు పైగా పార్టీలో ముందుపీఠిన నిలిచి వివిధ పార్టీ కమిటీల కార్యదర్శిగా, 27 యేండ్లకు పైగా కేంద్రకమిటీ సభ్యుడిగా, గత 18 యేండ్ల నుండి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా విజయవంతంగా నాయకత్వాన్ని అందించాడు. ముఖ్యంగా సైనిక రంగంలో కేంద్ర సైనిక కమీషన్ ఇన్‌చార్జిగా ఉంటూ ప్రజాయుద్ధ పురోగమనంలో కీలక పాత్ర పోషించాడు. ఇంకా నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే 1992 తర్వాత సమష్టి నాయకత్వంగా ఎదిగిన కేంద్రకమిటీలో ఒక ముఖ్యుడుగా ఉంటూ ప్రధాన కార్యదర్శిగా ఎదిగాడు.

పార్టీ కేంద్రకమిటీలో జరిగిన ఈ మార్పులు మొత్తం పార్టీ అభివృద్ధి క్రమంలో జరిగినవే. ఈ మార్పులు కేంద్రకమిటీకి మరింత శక్తినిస్తాయి. కేంద్రకమిటీ, పార్టీ నిర్మాణ సూత్రమైన కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్నీ, స్వయంవిమర్శ–విమర్శ సూత్రాలను అమలు చేయడంలో ఏమాత్రం పట్టు సడలకుండా, దృఢంగా అమలు చేస్తూ సమష్టి నాయకత్వాన్నీ, కేంద్రీకృత నాయకత్వాన్నీ మొత్తం పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికి అందిస్తుందనీ, శత్రువు ఫాసిస్టు తరహాలో, 'సమాధాన్' పేరుతో నేడు చేపట్టిన వ్యూహాత్మక విప్లవ ప్రతీఘాతుక దాడిని ప్రజాపంథా–వర్గపంథాపై ఆధారపడి ప్రజలను ప్రజాయుద్ధంలో సమీకరించి, ఓడించి, దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి కార్మికవర్గ అగ్రగామిగా నిలిచి నాయకత్వం వహిస్తుందనీ యావత్ విప్లవ పార్టీ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికీ కేంద్రకమిటీ హామీ ఇస్తున్నది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**